సాక్షి సంగారెడ్డి
ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



చెట్టును ఢీకొట్టిన బైక్..

బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. వివరాలు 9లో ▸



ఘనంగా శిలువ ఆరాధన

ప్రీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సంగారెడ్డి సీఎస్ఐ చర్చిలో శిలువ ఆరాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివరాలు 9లో ▸



పండుగలా కొత్త మెనూ

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచింది..

వివరాలు 9లో ▸

చలి వణికిస్తోంది

జిల్లాలో కొద్దిరోజులుగా తగ్గుముఖం పట్టిన చలి గత మూడురోజులుగా జిల్లావాసులను వణికిస్తోంది. మెల్లగా పగటి ఉష్ణోగ్రతలు కూడా తగ్గిపోవడంతో ప్రజలు చలి బారి నుంచి కాపాడుకునేందుకు చలిమంటలు వేసుకోవడంతోపాటు ఉన్నిదుస్తులను ధరిస్తున్నారు. ఇక చలికారణంగా రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. శనివారం న్యాల్‌కల్‌లో 9.8, కోహీర్‌లో 10.4 డిగ్రీల సెల్సీయస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.



చలి నుంచి ఉపశమనం కోసం మంట కాచుకుంటున్న ప్రజలు

మూడురోజులుగా పెరిగిన చలి తీవ్రత

- ఉదయం తొమ్మిది దాటినా వీడని చలి
- పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- చలి కాచుకునేందుకు మంటలు

సంగారెడ్డి జోన్: సంగారెడ్డి జోన్: జిల్లాలో గత మూడు రోజులుగా చలి తీవ్రత పెరుగుతుంది. ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో చలి తీవ్రత అధికమవుతుంది. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. పగటి పూట చల్లటి గాలులు వీస్తుండటంతో పగటి సమయంలో సైతం చలి వీడటం లేదు. రాత్రుల సమయాల్లో చలికి తట్టుకో లేక ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా ప్రజలు చలికి వణికిపోతూ ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్లన్నీ నిర్మానుష్యంగా...

జిల్లాలో శుక్రవారం కంగ్టిలో 10.1 న్యాల్‌కల్‌లో 10.6, సిర్గాపూర్‌లో 10.7 డిగ్రీల సెల్సీయస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా శనివారం న్యాల్‌కల్‌లో 9.8, కోహీర్‌లో 10.4 డిగ్రీలు నమోదు అయ్యాయి. జిల్లాలో గత కొన్ని రోజుల తర్వాత మూడు రోజులుగా చలి తీవ్రత అధికంగా ఉంటుంది. గ్రామాలలో రాత్రి 8గంటలు దాటితే జన సంచారం తగ్గి రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం కూడా చలి తీవ్ర ఎక్కువగా ఉంటుంది.

పెరిగే అవకాశం.. జాగ్రత్తలు తప్పనిసరి

మూడు రోజులుగా పెరుగుతున్న చలి తీవ్రతలు రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో చలి తీవ్రతలకు కారణం అవుతున్నాయి. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా వైద్యులు పలు సలహాలు ఇస్తున్నారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు అత్యంత జాగ్రత్తగా ఉండటం తప్పనిసరని హెచ్చరిస్తున్నారు. వేడి పదార్థాలు మాత్రమే ఆహారంగా తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వంట చేసుకుని తినడం మేలని సూచిస్తున్నారు.

ఉదయం 9గంటల దాటినా చలి ప్రభావం తగ్గడం లేదు. వేకువ జామున సమయంలో పంటలను మార్కెట్ తీసుకువెళ్లేందుకు తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు చలి నుంచి ఉపశమనం పొందేందుకు మంటలు వేసుకుంటున్నారు.

చలిమంటలు..ఉన్ని దుస్తులు...

పరిశ్రమలకు ఉదయం షిఫ్టులకు వెళ్లే కార్మికులు ఉన్ని దుస్తులు ధరించి విధులకు హాజరవుతున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా ప్రజలు వెచ్చని దుస్తులను ధరించి బయటకు వెళ్తున్నారు. పగలంతా ఎండలోనే కాలక్షేపం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఉదయం సమయంలో పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. ప్రస్తుతం పత్తితీత పనులతో పాటు చెరుకు నరికే పనులు జోరుగా సాగుతున్నాయి. వలస వచ్చిన కూలీలు జాగ్రత్తలు తీసుకుని పనులకు వెళ్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా ప్రజలు చలి నుంచి రక్షణగా పొందేందుకు రక్షణగా స్వెట్టర్లు వేసుకుని ఉంటున్నారు. విద్యార్థులు పాఠశాలలకు ఉదయం వెళ్లే సమయంలో తప్పనిసరిగా ధరించుకుంటున్నారు. ఖాళీ సమయాల్లో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

జిల్లాలో మండలాల వారీగా శనివారం చలి తీవ్రత నమోదు వివరాలు..

మండలం	కనిష్ఠం	గరిష్ఠం
న్యాల్‌కల్	9.8	27.6
కోహీర్	10.4	28.5
సిర్గాపూర్	10.7	28.4
కంగ్టి	11.4	26.4
జహీరాబాద్	11.6	28.2
నిజాంపేట	11.8	29.8
పుల్కల్	11.8	30.3
నాగిల్‌గిద్ద	11.9	29.6
మొగుడంపల్లి	12.0	29.3
అందోల్	12.0	31.9
వట్‌పలి	12.0	28.5
కల్హేర్	12.6	34.6
మనూర్	12.7	27.0
రాయికోడ్	12.7	27.9
ఝరాసంగం	12.8	28.6
హత్నూర	12.8	30.3
గుమ్మడిదల	13.1	26.5
కొండాపూర్	13.2	30.0
కంది	13.2	30.8
చౌటకూర్	13.2	29.3
సంగారెడ్డి	13.4	29.6
మునిపల్లి	13.5	27.8
రామచంద్రాపురం	13.5	30.2
సదాశివపేట	13.8	30.1
పటాన్‌చెరు	14.0	29.1
నారాయణఖేడ్	14.3	28.0
జిన్నారం	15.4	30.4
అమీన్‌పూర్	16.1	31.6

న్యూస్‌రీల్

రాజీ మార్గంతోనే కేసులు పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర



రాజీమార్గంతో కేసును పరిష్కరించిన జిల్లా జడ్జీలు

సంగారెడ్డి టౌన్ : రాజీ మార్గంతోనే కేసులు పరిష్కారమవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గంతో పరిష్కరించుకోవచ్చని జిల్లాలో మొత్తం 5,138 కేసులు పరిష్కారం చేశారన్నారు. ఇందులో క్రిమినల్, భూ తగాదాలు, మోటార్ వెహికల్, ఎక్సైజ్ కేసులు, బ్యాంకు కేసులు పరిష్కరించారని తెలిపారు. లోక్ అదాలత్‌కు న్యాయవాదులు, పోలీస్ బ్యాంక్ అధికారులు సహకరించారన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జీలు న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్ అధికారులు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 112 కేసుల పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.సూరికృష్ణ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. లోక్ అదాలత్‌లో మొత్తం 112 కేసులు పరిష్కారమైయ్యాయి. సీనియర్ సివిల్ కోర్టు విభాగంలో 69 బ్యాంక్ పీఎల్సీ కేసులు,1 సైబర్ క్రైమ్,1 ఇతర పీఎల్సీ కేసు పరిష్కారం కాగా రూ.1,23,98,307 వసూలు అయ్యాయి. జూనియర్ సివిల్ కోర్టు విభాగంలో 26 క్రిమినల్ కాంపౌండ్ కేసులు, 15 అడ్మిషన్ కేసులు పరిష్కారం కాగా రూ. 1,71,500 లక్షలు వసూలు అయ్యాయి.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

హత్నూరలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలనలో కలెక్టర్ క్రాంతి

హత్నూర(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. మండల కేంద్రమైన హత్నూరలో నిర్వహిస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారుల సమాచారాన్ని ఆన్‌లైన్లో సక్రమంగా పొందుపరచాలన్నారు. ఒక లబ్ధిదారి ఇంట్లో ఎంతమంది కుటుంబ సభ్యులు ఉన్నారు? ఎన్ని రేషన్ కార్డులున్నాయి? సొంత ఇల్లు అద్దె ఇల్లు అన్న విషయాన్ని డేటా ఎంట్రీ చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా ఉండాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కమిటీని సైతం సర్వేలో పాల్గొనే లా చూడాలన్నారు. కలెక్టర్ వెంట జెడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న, ఎంపీడీవో శంకర్ పాల్గొన్నారు.

పరిశ్రమల వ్యర్థాలతో చెరువులు కాలుష్యం

మానవ హక్కుల మండలి

ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

జిన్నారం (పటాన్‌చెరు): నీటితో నిండవలసిన చెరువులు, కుంటలు పారిశ్రామిక రసాయన వ్యర్థ జలాలతో నిండిపోయాయని మానవ హక్కుల మండలి ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ పేర్కొన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం, కాజిపల్లి పారిశ్రామిక ప్రాంతంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఆసానికుంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...పరిశ్రమలు బోర్ వెల్ ద్వారా రివర్స్ పంపింగ్ చేస్తూ భూగర్భ జలాలను పూర్తిగా కలుషితం చేస్తున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ ప్రాంతంలో మానవ మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీధర్ వెంట నాయకులు రోహిత్ సింగ్, సతీశ్ తదితరులున్నారు.



బొల్లారం ఆసానికుంటలు పరిశీలిస్తున్న మెట్టు శ్రీధర్

తగ్గేదేలే..

ఆటల్లో టీనేజీలమే..



క్రీడల్లో సత్తాచాటుతున్న సీనియర్ సిటిజన్లు

- జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లోనూ రాణింపు
- బృందంగా ఏర్పడిన 30 నుంచి 80 ఏళ్ల వయస్సు వారు
- ఆదర్శానికి వేదికగా మారిన భెల్ టౌన్‌షిప్

'మేము వృద్ధులం.. క్రీడల్లో టీనేజీలం.. ఏ ఆట అయినా తగ్గేదేలే'.. అంటూ సత్తా చాటుతున్నారు. ఎనిమిది పదులు దాటిన వారు సైతం యువకుల్లా ఆటల్లో రాణిస్తున్నారు. అంతేకాదు.. ఉరకలెత్తే ఉత్సాహంతో యువతకు దిశానిర్దేశం చేస్తున్నారు. నిత్యం మైదానాల్లో సాధన చేస్తూ సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేస్తున్నారు. భెల్ టౌన్‌షిప్‌లో 30 ఏళ్ల వయస్సు నుంచి 80 ఏళ్ల వయస్సు వారు ఒక బృందంగా ఏర్పడి ప్రతి ఒక్కరికీ క్రీడలో ఆసక్తి పెరిగేలా కృషి చేస్తున్నారు. రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, డిస్క్‌త్రో, జావెలిన్ త్రో వంటి అథ్లెటిక్స్‌లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా చేరి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటుతున్న వీరి గురించి ఈ వారం ప్రత్యేకం..

8లో



- పర్శా శ్రీనాథ్
- రామచంద్రాపురం(పటాన్‌చెరు)

గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి కొండా సురేఖ
- భోజనం మెనూచార్ట్‌ను ప్రారంభించిన మంత్రి
- భోజనం బాలేదని ప్రిన్సిపాల్‌పై మంత్రి ఆగ్రహం

హత్నూర(సంగారెడ్డి): గురుకుల విద్యాసంస్థలతో పాటు సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. హత్నూరలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలలో విద్యార్థులకు భోజన మెనూ చార్ట్‌ను శనివారం కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...గత కేసీఆర్ ప్రభుత్వం గురుకులాలను పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. నాసిరకం భోజనం అందించడం వల్ల హాస్టళ్లలో చదువుతున్న బాలికలు పౌష్టికాహారం లేక రక్తహీనతతో బాధపడుతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురుకుల పాఠశాల, కళాశాలలో హాస్టళ్లలో భోజనంతోపాటు కాస్మెటిక్ చార్జీలను పెంచినట్లు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం రూ.470 కోట్లను ప్రభుత్వం విడుదల చేసినట్లు వెల్లడించారు. గత పాలకులు విద్యార్థులను పట్టించుకోలేదు కానీ ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను విమర్శించడమే ప్రతిపక్షాలు పనిగా పెట్టుకున్నాయని మండిపడ్డారు. కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ...అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న లక్ష్యంతో జిల్లాకు రెండు ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను మంజూరు చేశామన్నారు. జిల్లాలో రూ.26 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో వసతులు కల్పించామని తెలిపారు. ఐఐటీ నీట్ కోచింగ్‌లను గురుకుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు భోజనాన్ని కలెక్టర్ క్రాంతితో కలసి మంత్రి స్వయంగా వడ్డించారు.

ప్రిన్సిపాల్‌పై మంత్రి ఆగ్రహం



హత్నూర గురుకుల విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి సురేఖ, కలెక్టర్ క్రాంతి

విద్యార్థులకు వండి పెట్టే ఆహార పదార్థాలు నాసిరకంగా ఉండటంతో ప్రిన్సిపాల్‌పై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటకు అవసరమైన నాసిరకం పదార్థాలు ఎందుకు కొనుగోలు చేశారని మందలించారు. నాణ్యమైన సరుకులతోనే ప్రతీరోజు మెనూ ప్రకారం వంట చేసి పెట్టాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంట సామాన్లు, స్టోర్‌రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన డైట్ మెనూ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ...ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలిసారి కాస్మెటిక్, డైట్ చార్జీలను పెంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపుతో విద్యార్థులకు మేలు కలుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు తగ్గట్టుగా చదువుకోవాలని సూచించారు. ప్రతీ ఏటా ఒక్కో విద్యార్థిపై రూ.లక్షకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తుందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకుల పాఠశాలను ప్రభుత్వం బలోపేతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవూజ, పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

దళితుల లాకప్ డెత్ జరిగినప్పుడు ఎక్కడికెళ్లావు?

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: నడిరోడ్డుపై హత్యలు, దళితుల లాకప్‌డెత్ జరిగినప్పుడు మాట్లాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సినీ నటుడు అరెస్టుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పోలీసు వ్యవస్థపై మాట్లాడటం సిగ్గుచేటని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి విమర్శించారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ...డిసెంబర్ 4న సినిమా సంధ్య థియేటర్‌వద్ద జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి భర్త భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగానే అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని తెలిపారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా!

పరిశ్రమల్లో కొరవడిన భద్రతా ప్రమాణాలు

- యాజమాన్య నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు
- తూతూ మంత్రంగా పీసీబీ అధికారుల తనిఖీలు
- బిక్కుబిక్కుమంటూ పని చేస్తోన్న కార్మికులు

జిన్నారం (పటాన్‌చెరు): పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు లేకపోవడంతో పెద్ద ఎత్తున అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లోని బొంతపల్లి, గుమ్మడిదల, గడ్డపోతారం, కాజిపల్లి, బొల్లారం, ప్రాంతాల్లో వందల సంఖ్యలో రసాయన పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమల్లో నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి.

భద్రతా ప్రమాణాలు పాటించని యజమాన్యాలు

ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లోని రసాయనిక పరిశ్రమల్లో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు యాజమాన్యాలు సరైన చర్యలు తీసుకోకపోవడమే కారణమని తెలుస్తోంది. ముఖ్యంగా రియాక్టర్ల వద్ద బైలర్ల వద్ద శిక్షణ పొందని కార్మికులతో విధులు నిర్వహిస్తుండటం, దాంతోపాటు భద్రత ప్రమాణాలు తీసుకోకపోవడంతో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణ నష్టం తప్పడం లేదు. పెద్ద సంఖ్యలో గాయాల పాలవుతున్నారు.

పీసీబీ అధికారుల వైఫల్యం

రసాయన పరిశ్రమలో పాటించవలసిన జాగ్రత్తలను యాజమాన్యాలు సరైన విధంగా అమలు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికితోడు రసాయనిక పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారుల తనిఖీలు నామమాత్రంగా నిర్వహించడం, అలాగే ప్రమాదాలు జరిగినప్పుడే ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ పరిశ్రమల్లో తనిఖీలు చేయడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు సంభవించిన చాలా సమయం వరకు అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో మరింత నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. తూతూ మంత్రంగా తీసుకునే చర్యలతో కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పీసీబీ, అగ్నిమాపక , ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శాఖల సమన్వయంతోనే పెద్ద ప్రమాదాలను సైతం నివారించవచ్చు. ప్రాణ నష్టాన్ని అరికట్టవచ్చు. కానీ, లోపభూయిష్టమైన నిఘా వ్యవస్థతో కార్మికుల ప్రాణాలను కోల్పోవలసి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుని కార్మికుల ప్రాణాలను రక్షించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

తరచూ పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు

పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమల్లో ఎక్కడో ఒకచోట తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం జరుగుతోంది. ఇటీవల కాలంలో జిన్నారం మండలం కాజిపల్లి పారిశ్రామికవాడలోని అరోరా లైఫ్ సైన్సెస్ రసాయన పరిశ్రమలో, బొల్లారంలోని అమరా ల్యాబ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాలకు ముఖ్య కారణాలు పరిశ్రమ యజమాన్యం కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమేనని అధికారులు గుర్తించారు. ఇలా పలు పరిశ్రమల్లో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని స్థానిక పారిశ్రామిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమయోచితంగా వ్యవహరిస్తూ భద్రతా ప్రమాణాలను విస్మరిస్తున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేసవిలో ప్రమాదాలకు అవకాశం...

రానున్నది వేసవికాలం కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశ్రమల యాజమాన్యాలు కచ్చితంగా భద్రతా ప్రమాణాలు పాటించేలా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే ఆస్తి ప్రాణ నష్టాలు జరగకుండా కట్టడి చేయవచ్చని పారిశ్రామిక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



కాజిపల్లి పారిశ్రామికవాడలోని పరిశ్రమలో ఎగిసిపడుతున్న మంటలు (ఫైల్)

భద్రతలో పరిశ్రమల వైఫల్యం



పారిశ్రామిక వాడలోని చాలా పరిశ్రమల్లో భద్రత వైఫల్యాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు బయటపడతాయి. భద్రతా ప్రమాణాలను పాటించకుండా పరిశ్రమలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. స్థానికంగా మాలో భయాందోళన నెలకొంది. కానీ సంబంధిత అధికారులు భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై చర్యల ఊసే లేదు.

– ధర్మయ్య, గ్రామస్తుడు, గడ్డపోతారం

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయంటే అధికారుల నిఘాలోపమే కారణం. పరిశ్రమలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. ఇక భద్రత విషయంలో చెప్పనవసరం లేదు. యాజమాన్యాలు కార్మికుల భద్రతకు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఎన్ని ఫిర్యాదులు చేసిన ఫలితం మాత్రం శూన్యం. పీసీబీ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారుల తనిఖీలు నిఘా లోపంగా, ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి.

– వెంటేష్, మాజీ ఉపసర్పంచ్ గడ్డపోతారం

క్లుప్తంగా

హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిదని ప్రజాహిత మానవ పరిరక్షణ కమిటీ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రజాహిత మానవ పరిరక్షణ కమిటీ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా చైర్మన్‌గా రాచకొండ శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా హరిదాస్, జనరల్ సెక్రటరీగా హరి ప్రసాద్ చారి, సెక్రటరీగా శ్రీనివాస్ గౌడ్, పరశురాం, కోశాధికారిగా రామచంద్రం, మహిళా కమిటీ చైర్మన్‌గా రజిని, వైస్ చైర్మన్‌గా ప్రసన్నలను నియమించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మీ చుట్టూ ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, డైరెక్టర్ భిక్షం, సెక్రటరీ అశోక్, జనరల్ సెక్రటరీ దుర్గారావు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ షాపులో అగ్ని ప్రమాదం

సంగారెడ్డి క్రైమ్: స్టీల్ అండ్ ఐరన్ షాపులో అగ్ని ప్రమాదం శనివారం చోటు చేసుకుంది. సంగారెడ్డి పట్టణ ఫైర్ ఎస్సై కిరణ్ కుమార్ రెడ్డి కథనం మేరకు.. పట్టణానికి చెందిన రాహుల్ అనే వ్యక్తి సంగారెడ్డిలో కొద్ది రోజులుగా ఐరన్ అండ్ స్టీల్ షాపు నడుపుతున్నాడు. దుకాణంలో ఉండే హైడ్రాలిక్‌లో శనివారం చిన్నపాటి ప్రమాదం జరిగి మంటలు చెలరేగి సామగ్రి కాలిపోయింది. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపారు.

తగ్గేదేలే..

- క్రీడల్లో రాణిస్తున్న సీనియర్ సిటిజన్స్
- బంగారం, వెండి పతకాలు సాధిస్తూ..
- మేము యువకులమే అంటున్న వృద్ధులు
- జిల్లాలో సుమారు 220 మందికి పైగా మాస్టర్ అథ్లెటిక్ క్రీడాకారులు

వారందరూ 30 నుంచి 80 ఏళ్ల పైబడిన వారే.. ఈ వయసులోనూ ఆటల్లో చురుగ్గా రాణిస్తూ యువకులతోపాటు పోటీ పడుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ తగ్గేదేలే అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 220 మంది మాస్టర్ అథ్లెటిక్ క్రీడాకారులున్నారు. 80 ఏళ్లు దాటిన వారు సైతం రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, డిస్కస్ త్రో, ట్రిబుల్ జంప్ క్రీడల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు):

క్రీడలో రాణించాలంటే వయస్సుతో సంబంధం లేదంటున్నారు మాస్టర్ అథ్లెటిక్ క్రీడాకారులు. కేవలం పట్టుదల ఉంటే చాలు అనుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చని నిరూపిస్తున్నారు. 30 ఏళ్ల వయస్సు వారితో 80 ఏళ్ల వయస్సు వారు క్రీడల్లో పోటీ పడుతూ పతకాలను సాధిస్తున్నారు. అంతే కాకుండా ఉద్యోగ విరమణ పొందిన వారిని క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిస్తున్నారు.

రోగాలకు క్రీడలే మంచి మందు

ఎంతటి రోగాలకైన మంచి మందు క్రీడలే అంటున్నారు సీనియర్ సిటిజన్ క్రీడాకారులు. ఈ క్రీడలతోనే పెద్ద పెద్ద రోగాలను సైతం జయించామని చెబుతున్నారు. నిత్యం కొంత సమయాన్ని అందరితో కలిసి క్రీడలకు కేటాయిస్తే రోగాలు దరిచేరవని సూచనలు చేస్తున్నారు. ప్రధానంగా యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పిలుపునిస్తున్నారు.



షాట్‌పుట్ వేస్తున్న మహిళ



లాంగ్ జంప్ చేస్తూ..

పతకాలు కోసం పోటీ..

మాస్టర్ అథ్లెటిక్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకాలు సాధించేందుకు పోటీ పడుతున్నారు. నిత్యం వృద్ధులు బీహెచ్‌ఎస్ స్టేడియంలో చల్లటి చలిలో సైతం వారి ప్రావీణ్యం ఉన్న క్రీడల్లో ప్రాక్టీస్ చేయడం చూస్తే వారిలో ఉన్న పట్టుదలను అర్థం చేసుకోవచ్చు. రన్నింగ్, షాట్‌పుట్, టాంగ్‌జంప్, డిస్క్‌త్రో, తిబ్రుల్‌జంప్ పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పథకాలను సాధిస్తున్నారు. శ్రీలంక, సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, చైనా, కొరియాలలో జరిగిన అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని జిల్లాకు పేరు ప్రఖ్యాతలను సాధించి 80 ఏళ్లు దాటినా మేము టీనేజీలమే అంటున్నారు వెటరన్ క్రీడాకారులు.



జావెలిన్ త్రో వేస్తున్న క్రీడాకారిణి



మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారం

జిల్లా మాస్టర్ అథ్లెటిక్ క్రీడాకారులకు అండగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నిలిచారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు తన వంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. అంతే కాకుండా క్రీడాకారులందరికీ ట్రాక్ సూట్, క్రీడా పోటీలను నిర్వహిస్తూ వారిని మరింత ప్రోత్సహిస్తున్నారు.



హై జంప్ చేస్తున్న వృద్ధుడు

20 బంగారు పతకాలు సాధించా



80 ఏళ్ల వయస్సు జాతీయ, అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో 20 బంగారు, 20 వెండి, 15 క్యాంస పతకాలను సాధించాను. క్రీడలు ఆడటం వల్ల నేను ఎంతో ఆరోగ్యంగా చురుగా ఉన్నాను. ప్రతీ అందరం కలిసి ప్రాక్టీస్ చేస్తాం.

– కిరణ్ కుమార్ రెడ్డి, క్రీడాకారుడు

వెటరన్ క్రీడాకారులను ప్రోత్సహించాలి



వెటరన్ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. ప్రధానం మాస్టర్ అథ్లెటిక్‌లో ఎక్కువగా 50 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయస్సు వారు ఉన్నారు. అందుకే వారిని ప్రోత్సహిస్తున్నాను. జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ చైర్మన్‌గా వ్యవరిస్తున్నాను. ఆరోగ్యమే మహాభాగ్యం.

– గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్యే

క్రీడలతోనే ఆరోగ్యం



ఈ పోటీ ప్రపంచంలో క్రీడలు ఆడటం వల్ల మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. నిత్యం గంట సేపు మానకు నచ్చి క్రీడలు ఆడటం వల్ల రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటాం. వయస్సుతో పని లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి.

– వీ.సంధ్య, బీహెచ్ఈఎల్



లాంగ్‌జంప్‌లో విజయం సాధించి బహుమతి తీసుకుంటున్న భాస్కర్ రావు

క్రీడలంటే ఇష్టం



చిన్ననాటి నుంచి క్రీడలంటే నాకు ప్రాణం. ఉద్యోగ విరమణ చెందిన తర్వాత మాస్టర్ అథ్లెటిక్‌లో చేరి జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో అనే పతకాలను సాధించాను. మలేషియా, ఇండోనేషియాలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని లాంగ్‌జంప్‌లో పతకాలు సాధించడం ఆనందంగా ఉంది.

– బీ.భాస్కర్ రావు, రిటైర్డ్ ఆర్టీసీ డిపో చైర్మన్

క్యాన్సర్‌ను జయించాను



రోగాలకు మంచి మందు క్రీడలే. నాకు వచ్చిన రొమ్ము క్యాన్సర్‌ను క్రీడలతోనే జయించాను. ప్రతి ఒక్కరూ జీవితంలో ఎంత బిజీగా ఉన్న ఆరోగ్యం రోజూ కొంత సమయాన్ని కేటాయించండి. నేను రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో అనేక పతకాలను సాధించాను.

– విక్కీ ప్రిస్కిల్లా, క్రీడాకారిణి

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



30 ఏళ్లు దాటిన ఎవరైన మాస్టర్ అథ్లెటిక్ క్రీడల్లో పాల్గొనవచ్చు. ప్రధానం ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలి. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నాం. మాకు స్థానిక ఎమ్మెల్యే ఎంతో సహాయం చేస్తున్నారు. మా అసోసియేషన్‌కు చైర్మన్‌గా మహిపాల్ రెడ్డి వ్యవరిస్తున్నారు.

– ఎండీ ఇక్బాల్, జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు

అటవీ భూముల్లో నిర్మాణాలు సహించం

నర్సాపూర్ అర్బన్ పార్కు పర్యటనలో మంత్రి కొండా సురేఖ

నర్సాపూర్ : అటవీ భూముల్లో నిర్మాణాలు చేపడితే సహించేది లేదని మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. శనివారం ఆమె నర్సాపూర్‌లోని అర్బన్ పార్కులో పర్యటించారు. పార్కులోని వాచ్ టవర్ వద్ద పర్యటన ముగించుకొని వెళ్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తదితరులు ఆమెతో మాట్లాడారు. కౌడిపల్లి మండలం వెల్మకన్నె తండాకు చెందిన రాజేందర్ పేద వాడని, తనకున్న అటవీ భూమిలో రేకుల షెడ్డు నిర్మించుకొని నివసిస్తున్నాడని తెలిపారు. అటవీ శాఖ అధికారులు పూరి గుడిసెను తొలగించాలని సూచించారని, తొలగించని పక్షంలో తామె కూల్చి వేస్తామని హెచ్చరిస్తున్నారని మంత్రికి వివరిస్తూ పూరి గుడిసె తొలగించకుండా అటవీ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మంత్రి కొండా సురేఖ స్పందిస్తూ అటవీ భూముల్లో పక్కా నిర్మాణాలు చేపట్టొద్దని, ఒకవేళ నిర్మిస్తే అధికారులు తొలగిస్తారని, అటవీ భూములు కాపాడేందుకు అధికారులకు అందరం అండగా ఉండాలని హితవు పలికారు. అటవీ భూమిలో నిర్మించిన పూరి గుడిసెను తొలగించొద్దని స్థానిక అధికారులను తాను ఈ రోజు ఆదేశిస్తే రేపు మరొకరు అడుగుతారని ఆమె పేర్కొన్నారు.అలాంటి ఆదేశాలు ఇవ్వలేనని, రాజేందర్ పేద వాడైతే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని మంత్రి కొండా సురేఖ స్థానిక కాంగ్రెస్ నాయకులకు హామీ ఇచ్చారు.



మంత్రితో మాట్లాడుతున్న నాయకులు

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

దుబ్బాకటౌన్: ఉరేసుకొని వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో చోటు చేసుకుంది. శనివారం దుబ్బాక ఎస్సై గంగరాజు కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామానికి చెందిన ఎనగందుల తిరుపతి(53) బతుకు దెరువు నిమిత్తం 23 ఏళ్ల కిందట కుటుంబంతో సహా దుబ్బాక పట్టణానికి వలసొచ్చి జీవిస్తున్నాడు. అప్పు చేసి ఇల్లు కొనుగోలు చేశాడు. ఇటీవల మరి కొంత అప్పు చేసి కోడిగుడ్ల వ్యాపారం నిర్వహిస్తూ ఎలక్ట్రికల్ ఆటో కొనుగోలు చేశాడు. కొంతకాలంగా వ్యాపారం సరిగ్గా నడవక రూ.8 లక్షల వరకు అప్పులు పెరిగిపోవడంతో తీర్చే మార్గం లేక మానసికంగా కుంగిపోయాడు. మద్యానికి బానిసగా మారి, అప్పులు తీర్చడం కంటే చావడం నయమని తరచూ కుటుంబ సభ్యులతో ఆవేదన వ్యక్తం చేసేవాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దుబ్బాక నుంచి మల్లయిపల్లికి వెళ్లే దారిలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం గుర్తించిన స్థానిక రైతులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య శివలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపుతప్పి స్కూటీని ఢీకొట్టిన కారు

ముగ్గురికి తీవ్ర, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

కొండపాక(గజ్వేల్): అతివేగంగా, అజాగ్రత్తగా వెళ్తున్న కారు అదుపుతప్పి స్కూటీని ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక శివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వేగంగా వెళ్తున్న కారు మెదక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి రాగానే అదుపుతప్పి మొదట డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం అవతలి వైపు నుంచి వెళ్తున్న స్కూటీని ఢీకొట్టి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న శ్రీనివాస్, అశ్వినీలతోపాటు కారులో ప్రయాణిస్తున్న జతిన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.



కొండపాక(గజ్వేల్): దెబ్బతిన్న కారు

ఆటోను ఢీకొట్టిన బైక్..

చేర్యాల(సిద్దిపేట): ఆటోని బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన శనివారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని ముస్త్యాలకి చెందిన గూడెపు రవి కుమార్ బైక్‌పై చేర్యాల నుంచి ముస్త్యాల వైపునకు వెళ్తున్నాడు. స్థానిక హనుమాన్ గుడి సమీపంలో ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో రవికుమార్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యంకై పెద్దాసుపత్రికి తరలించాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ తరలించారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

అదనపు ఎస్పీ సంజీవరావు

సంగారెడ్డి జోన్: క్రమశిక్షణతో పోలీసు సిబ్బంది విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు సూచించారు. శనివారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్స్ లో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్, కానిస్టేబుల్స్ కు వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ.. శారీరకంగా, మానసికంగా ఫిట్ గా ఉన్నప్పుడే ఎలాంటి పరిస్థితులలోనైనా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, ఆర్ఐలు రామారావు, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, తదితరులు పాల్గొన్నారు.

దైవదర్శనాకి వెళ్లి మృత్యు ఒడిలోకి

గుండెపోటుతో యువ పూజారి మృతి



సాయిప్రసాద్ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): దైవ దర్శనానికి వెళ్లిన ఓ యువ పూజారి మృత్యుఒడిలోకి చేరారు. ఈ ఘటన అక్కన్నపేట మండలం మల్లంపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మల్లంపల్లి గ్రామంలోని లక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయంలో పూజారిగా చేస్తున్న సాయి అలియాస్ సాయిప్రసాద్(33) పదేళ్లుగా మల్లంపల్లిలోని లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో పూజారిగా ఉంటూ పూజలు చేస్తున్నారు. శనివారం యాదగిరిగుట్టలోని లక్ష్మీనర్సింహ స్వామి దైవ దర్శనానికి వెళ్లాడు. దర్శనం తర్వాత ప్రసాదం తింటున్న క్రమంలో ఛాతిలో నొప్పిగా ఉందంటూ ఒక్కసారిగా కుప్పకూలి పోవడంతో హుటాహుటినా స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

రూ.25 లక్షల విలువైన ఆల్ఫాజోలం పట్టివేత



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్

సిద్దిపేటఅర్బన్: నిషేధిత ఆల్ఫాజోలంను తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ కథన మేరకు.. కిష్టసాగర్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు నిషేధిత మత్తు పదార్థంను విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు సమాచారం వచ్చింది. డీటీఎఫ్ పోలీసులతో కలిసి ఎక్సైజ్ పోలీసులు గడ్డమీది రాజుగౌడ్‌ను పట్టుకొని అతడి వద్ద సుమారు రూ.25 లక్షల విలువ చేసే 2.5 కిలోల ఆల్ఫాజోలం స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు మరుపల్లి అర్జున్ గౌడ్ పరారయ్యాడు. వీరితోపాటు చేపూరి నర్సింలు మత్తు పదార్థంను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించారు. నర్సింలు ప్రస్తుతం వేరే కేసులో బోధన్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. మత్తు పదార్థంతో పట్టుబడిన రాజుగౌడ్‌ను కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు. నిందితులను పట్టుకున్న వారిలో డీటీఎఫ్ సీఐ శ్రీధర్, ఎస్సైలు సరిత, విజయ్, కిరణ్, హెడ్ కానిస్టేబుల్ చెన్నగౌడ్, రవీందర్, కానిస్టేబుల్స్ స్వామిరెడ్డి, స్వామి, శరత్‌చంద్ర, కార్తీక్, రవి, శ్రీనివాస్‌రెడ్డి, మౌనిక, కవిత, బాలమణి, మంజుల, స్వాతి ఉన్నారు.

లోక్ అదాలత్ సరైన వేదిక

- పెండింగ్ కేసులను రాజీ చేసుకుంటే సమయం ఆదా
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి
- 5,517 కేసులను పరిష్కరించిన న్యాయమూర్తులు



కేసులను పరిష్కరిస్తున్న సాయి రమాదేవి, న్యాయమూర్తులు

సిద్దిపేటకమాన్: క్షణికావేశంలో చేసిన తప్పులను, పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ సరైన వేదిక అని.. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకుంటే సమయం వృథా కాదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. సిద్దిపేట జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా న్యాయమూర్తులు పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీ పడదగిన కేసులను ఇరు పక్షాలు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడం ద్వారా డబ్బులు, సమయం ఆదా అవుతుందన్నారు. ఈ విషయాన్ని న్యాయవాదులు, పోలీసులు పార్టీలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. లోక్ అదాలత్‌లో నవీన్‌లాస్య దంపతులు రాజీ పడినట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో 5,480 క్రిమినల్, 27 సివిల్ కేసులు పరిష్కరించినట్లు, 10 మోటార్ ప్రమాద కేసుల్లో రూ.కోటి 9 లక్షల 95 వేలు బాధితులకు ఇప్పించి పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ప్రీ లిటిగేషన్ కేసులైన బ్యాంకు కేసులు 36 (రూ.9,84,273) రాజీ పడినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి, న్యాయమూర్తులు మిలింద్‌కాంబ్లి, చందన, శ్రావణి, తరణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, సెక్రటరీ మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు దేవునూరి రవిందర్, తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన బైక్ : ఒకరు మృతి

మరొకరికి తీవ్రగాయాలు

దుబ్బాక: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టడటంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన దుబ్బాక పట్టణంలోని చీకోడ్ రోడ్డులో పాత ఎల్లమ్మ గుడి వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. 108 ఈఎంటీ నాగరాజు, పైలట్ స్వామి కథనం మేరకు.. మండలంలోని రామక్కపేటకు చెందిన నర్సింలు (50), ప్రశాంత్ బైక్‌పై దుబ్బాకకు వస్తుండగా పాత ఎల్లమ్మ గుడి సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ నర్సింలు, ప్రశాంత్‌ను 108లో చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ నర్సింలు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బైక్ ఢీకొని మహిళ..

మనోహరాబాద్(తూప్రాన్): బైక్ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన ఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ కథనం మేరకు.. మనోహరాబాద్ మండలం రామాయపల్లికి చెందిన కటికల రేణుక (38) స్థానికంగా ఉన్న ఇందూస్ పరిశ్రమలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. రోజు మాదిరి శనివారం తెల్లవారు జామున పరిశ్రమకు వెళ్తూ.. జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా మేడ్చల్ వైపు నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్న బైక్ వేగంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన రేణుకను తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు చరణ్, రిషికేష్ ఉన్నారు. మృతురాలి అల్లుడు దాసారం మధుబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు

హవేళిఘణాపూర్(మెదక్): గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మెదక్ మండలం మాచవరం శివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. టేక్మాల్ మండలం బోడగట్టు గ్రామానికి చెందిన ఘనపురం రాజేశ్ గౌడ్(37) స్వగ్రామం నుంచి మెదక్ వైపు బైక్‌పై వస్తున్నాడు. మాచవరం శివారులోని పైపుల ఫ్యాక్టరీ వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



హవేళిఘణాపూర్(మెదక్): ప్రమాద స్థలంలో రాజేశ్‌గౌడ్ మృతదేహం

కిందపడి మేస్త్రీ..

చిన్నశంకరంపేట(మెదక్): భవన నిర్మాణం చేస్తున్న మేస్త్రీ కిందపడటంతో మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం చెన్నాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. చెన్నాయిపల్లి గ్రామానికి చెందిన గంట ఆనందం(49) మేస్త్రీ పనులు చేస్తాడు. శుక్రవారం మండలంలోని వెంకట్రావుపల్లిలో ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా గోవా కట్టె మీద నుంచి కిందపడగా గాయాలపాలయ్యాడు. ప్రాథమిక చికిత్స తీసుకొని ఇంటికి వెళ్లాడు. శనివారం ఛాతిలో నొప్పితో అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.